క్లుప్తంగా

సాంకేతికతపై పట్టు సాధించాలి


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న చైర్మన్ శాంతిరాముడు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్టు వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో సిగ్మా (14వ జాతీయ స్థాయి సాంకేతిక సమ్మేళనం) నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శాంతిరాముడు మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలన్నారు. ఇలాంటి పరిశోధనల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో ఆలోచన విధానం మెరుగుపడుతుందన్నారు. మారుతున్న కాలానుగుణంగా సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా తొలిరోజు సాంకేతిక ఈవెంట్లు, రెండవ రోజు కళా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం బ్రోచర్‌ను విడుదల చేశారు. డీన్ ఆశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విద్యా సామగ్రి విరాళం


పంపిణీ చేసిన విద్యా సామగ్రితో సంస్థ సిబ్బంది, ఉపాధ్యాయులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని దిన్నేదెవరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు శుక్రవారం ఇన్ఫినిటీ ఫిన్ కార్ప్ సొల్యూషన్స్ ప్రైవేట్ సంస్థ నిర్వాహకులు కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.1,40,000 విలువైన సామగ్రిని విరాళమిచ్చారు. గ్రంథాలయంలో పుస్తకాల కోసం బీరువా, 20 చెక్క డెస్కులు, 10 ప్లాస్టిక్ కుర్చీలు అందజేసినట్లు ఉపాధ్యాయుడు మహమ్మద్ యాసిన్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఏరియా సేల్స్ మేనేజర్ భీంరావ్ పాల్గొన్నారు.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

సి.బెళగల్: ప్రజాపంపిణీలో సక్రమంగా సాగాలని సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, సరుకుల పంపిణీ దారుల(ఎండీయూ ఆపరేటర్ల)తో సమావేశమయ్యారు. గ్రామాల్లో సరుకుల పంపిణీలో అక్రమాలు జరిగితే సహించేది లేదన్నారు. కొందరు ఎండీయూ ఆపరేటర్లు అధికంగా డబ్బు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎర్రమట్టి తవ్వకాలపై నిఘా

కర్నూలు(రూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో ఎర్రమట్టి తవ్వకాలపై నిఘా ఉంచినట్లు కర్నూలు ఆర్డీఓ కిదారి సందీప్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జగన్నాథగట్టు పరిధిలో ఎవరైనా అక్రమంగా ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దిన్నెదేవరపాడు గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ అధికారులతో జగన్నాథగట్టుపై తవ్వకాలు జరగకుండా 24 గంటలూ నిఘా ఉండేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. గట్టు సమీపంలో ఎవరైనా అక్రమ తవ్వకాల చేపడితే 90007 10183, 94915 93036 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆర్డీఓ కోరారు.

బహిరంగ సభకు తరలిరండి

కర్నూలు(రూరల్): మార్చి 15న గన్నవరంలో నిర్వహించనున్న లక్ష గొంతులు .. వేల డప్పుల బహిరంగ సభకు పార్టీలకు అతీతంగా మాదిగలు తరలి రావాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ కోరారు. స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు బి.సుభాకర్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆకెపోగు వెంకటస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్.మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులందరూ సుభిక్షంగా ఉండాలి

గడివేముల: రైతులు బాగుంటేనే దేశం బాగుటుందని, రైతులందరూ సుభిక్షంగా ఉండాలని మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా భోగేశ్వరాలయం పరిధిలో రాష్ట్రస్థాయి నాలుగు పళ్లలోపు వృషభాల బండలాగుడు పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మహాశివరాత్రి వేళ వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించడం శుభపరిణామన్నారు. సేవాకమిటీ సభ్యుడు కంది శ్రీనివాసులు, ఈశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

భోగేశ్వరాలయం పరిధిలో రాష్ట్రస్థాయి నాలుగు పళ్లలోపు వృషభాల బండలాగుడు పోటీలు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో నాగర్ కర్నూలు జిల్లా రాయవరం గ్రామానికి చెందిన అక్షయరెడ్డి వృషభాలు విజేతగా నిలిచి రూ.50 వేలను గెలుపొందాయి. తరువాతి స్థానాల్లో నిలిచిన పాణ్యం మండలం పిన్నాపురం వెంకట కృష్ణయ్య వృషభాలు రూ.40 వేలు, వైఎస్సార్ జిల్లా రాయల్ రెడ్డి ప్రసాద్ వృషభాలు రూ.30 వేలు గెలుచుకున్నాయి.

ఎన్నాళ్లీ ఎదురు చూపులు?

- ఎనిమిది నెలలవుతున్నా మంజూరు కాని కొత్త పింఛన్లు
- నిరాశలో వృద్ధులు, వితంతువులు
- కొత్త దరఖాస్తులకు మోక్షం కలిగేనా!

వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసే సామాజిక పింఛన్లే ఆధారం. ప్రతినెలా ఒకటో తేదీ కోసం వీరంతా ఆశగా ఎదురుచూస్తుంటారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పింఛన్ సొమ్ము రూ.3 వేలు పెంచి ఆదుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పింఛన్ నగదు రూ.4 వేలకు పెంచింది. అయితే కొత్తగా ఒక్కరికి కూడా పింఛన్ మంజూరు చేయలేదు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు పూర్తయినా కనీసం దరఖాస్తు చేసుకోవడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. దీంతో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. – కర్నూలు(రూరల్)

కర్నూలు మండలంలో కొత్తగా పింఛన్లకు అర్హత పొందిన వారు వందల సంఖ్యలో ఉన్నారు. ఉల్చాల, పంచలింగాల, ఇ.తాండ్రపాడు, గార్గేయపురం, రేమట, బి.తాండ్రపాడు, దిన్నెదేవరపాడు, గొందిపర్ల, పసుపల, మేజర్ పంచాయతీలో 60 ఏళ్లు నిండిన వారు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు పెన్షన్ నూతనంగా పొందేందుకు ఎదురుచూస్తున్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. మరో వైపు వికలాంగులకు, మంచానికే పరిమితమై పింఛన్ పొందుతున్న వారిని వెరిఫికేషన్ పేరుతో ఏరివేతకు శ్రీకారం చుట్టడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే పింఛన్లు

గత వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొత్త పింఛన్లు, కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు ప్రక్రియను నిరంతరం కొనసాగించారు. ఇంటివద్దకే వలంటీర్లు వచ్చి అర్హుల నుంచి అవసరమైన పత్రాలు స్వీకరించి పథకాలు మంజూరు చేసేవారు. అనంతరం కూడా ఇంటి వద్దకే వచ్చి ప్రతినెలా ఒకటో తేదీ పింఛన్ అందించారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అసలు ఆ వెబ్‌సైటే ఓపెన్ చేయకుండా ఉద్దేశపూర్వకంగా ప్రజాసంక్షేమాన్ని నీరుగారుస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త పింఛన్ల దరఖాస్తు చేసుకునేందుకు నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేకపోతున్నామని అర్హులు ఆందోళన చెందుతున్నారు. అంతేగాకుండా కొత్తగా వివాహమైన వారు రేషన్ కార్డుల కోసం కూడా వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో నిరాశ చెందుతున్నారు.



కర్నూలు మండల ప్రజాపరిషత్ కార్యాలయం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి

ప్రభుత్వ జీఓ అనుసరించి 2024 సంవత్సరం నవంబర్ 1 తేదీ నుంచి వృద్ధాప్య పింఛన్ తీసుకునే వ్యక్తి 1 నుంచి 15వ తేదీల మధ్య మరణిస్తే మరుసటి నెలకే వితంతు పింఛను మంజూరవుతుంది. 16 నుంచి 30వ తేదీ మధ్య మరణిస్తే తదుపరి నెల కాకుండా మరో నెలలో పింఛన్ మంజూరవుతుంది. కొత్త పింఛన్లు, కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు వచ్చిన వెంటనే వెబ్‌సైట్ ప్రారంభించిన తర్వాతే అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం.
– జి.రఘునాథ్, ఎంపీడీఓ, కర్నూలు మండలం

పింఛన్ ఎప్పుడిస్తారో



నా భర్త చనిపోయి ఆరు నెలలు దాటింది. ఇప్పటికీ పింఛన్ అందడం లేదు. పలుమార్లు సచివాలయ సిబ్బందిని అడిగినా ప్రభుత్వం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వలేదు. ఇస్తేనే దరఖాస్తులు పరిశీలించి అర్హత ఉన్న వారికి పింఛన్ మంజూరు చేస్తామని చెబుతున్నారు. నాకు మాత్రం ఇప్పటికీ రాలేదు.
– టి.మహేశ్వరమ్మ, ఇందిరమ్మ కాలనీ, ఇ.తాండ్రపాడు గ్రామం

17 నెలలైనా ఇవ్వలేదు



నా భర్త 17 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాను. మందుల ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసి నాలాంటి వారిని ఆదుకోవాలి.
– బోయ అయ్యమ్మ, కొత్త మసీద్ కాలనీ, పంచలింగాల గ్రామం

ఒంటరి దాన్ని.. ఆదుకోండి



నా భర్త చనిపోయి 14 నెలలవుతోంది. ఒంటరిదాన్ని. పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి. ఆరు నెలలకోసారి పింఛన్లు మంజూరవుతాయని ఆశగా ఎదురుస్తున్నా. కొత్త పింఛన్ల మంజూరు చేసే విషయంలో వాయిదా వేయడం తగదు.
– వడ్డె సావిత్రమ్మ, ఉల్చాల గ్రామం

బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ఆత్మకూరులో అతిసార ప్రబలి ఇద్దరు మృతికి కారణమైన ప్రభుత్వం బాధ్యత వహించి ఆయా కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. ఆత్మకూరు పట్టణం మూడు నెలల నుంచి నీరు కలుషితమవుతుందని ప్రజలు అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యవైఖరితోనే ఇద్దరు మృతి చెందారన్నారు. నీరు కలుషితమవడంతో అతిసార ప్రబలి కాలనీకి చెందిన ఇద్దరు మృతి చెందడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య విషయంలో పట్టించుకోకపోవడం వల్ల ఈ పరిస్థితికి దారి తీసిందన్నారు. నేతలందరూ ప్రజలకు అందించాల్సిన సుపారిపలనపై కాకుండా ఇతర విషయాల మీద బిజీగా ఉంటున్నారని విమర్శించారు. నీరు కలుషితమై ఇద్దరు మరణించాక ఆత్మకూరులో డ్రైనేజీలు శుభ్రం చేస్తున్నారన్నారు.

విద్యార్థులపై కూలిన చెట్టు

- సైన్స్ దినోత్సవంలో అపశృతి


విద్యార్థులపై కూలిన చెట్టు

సి.బెళగల్: జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. కర్నూలు జిల్లా సి.బెళగల్ మండల పరిధిలోని పోలకల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ సైన్స్ నమూనాలను ప్రదర్శనకు ఉంచారు. ఇందుకు సంబంధించి బహుమతుల ప్రదానోత్సవ సమయంలో సమావేశ వేదిక వద్ద ఎండిన భారీ వృక్షం విద్యార్థులపై కూలింది. ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులు గాయపడ్డారు. గాయపడిన శ్రీలేఖ, కావ్య, ఉమ (7వ తరగతి), విజయలక్ష్మి, శ్రీలేఖ (8వ తరగతి), వీరతేజ, ఇందు (9వ తరగతి)లను ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ రాణెమ్మ పాఠశాలను సందర్శించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.


గాయపడిన విద్యార్థినికి ప్రథమ చికిత్స చేస్తున్న టీచర్

విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి


విద్యార్థినికి బహుమతి అందిస్తున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

పాణ్యం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నంద్యాల జిల్లా డీఈఓ జనార్దన్‌రెడ్డి హాజరయ్యారు. జిల్లా సమన్వయకర్త కె.వి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా వికసిత్ భారత్, సి.వి రామన్ ఆవిష్కరణలపై వ్యాసరచన, వక్తృత్వ, సైన్స్ నమూనా ప్రాజెక్టుల ప్రదర్శన పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన విద్యార్థులకు జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. సైన్స్‌కు సంబంధించిన మూల సిద్ధాంతాలు, సూత్రాలపై అవగాహన పెంచుకొని వినూత్న ఆవిష్కరణలు చేయాలన్నారు. ప్రతి విద్యార్థి బాల శాస్త్రవేత్తగా ఎదగాలన్నారు. ఎంఈఓ కోటయ్య మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే శాస్త్ర, సాంకేతిక రంగాలపై దృష్టి సారించాలన్నారు. సి.వి రామన్ ఆవిష్కరణలు, రామన్ ఎఫెక్ట్ గురించి జిల్లా సైన్స్ సమన్వయకర్త కె.వి సుబ్బారెడ్డి వివరించారు. హెచ్ఎం మేరీ సునీత, ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం, సైన్స్ అధికారి సుందర్‌రాజు, జిల్లా ఎన్‌జీసీ కో– ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, దీక్ష కో–ఆర్డినేటర్ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు గదులు సర్దుబాటు చేయండి

పాణ్యం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తరగతి గదుల కొరత ఉందని, దీంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నట్లు ఎస్ఎస్‌యూఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ప్రతాప్, ఏఐఎఫ్‌బీ నాయకుడు వెంకటాద్రి తదితరులు డీఈఓ జనార్దన్ రెడ్డికి వినతి పత్రం అందించారు. శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సైన్స్ డే కార్యక్రమానికి వచ్చిన డీఈఓకు వినతి పత్రం అందించి సమస్యలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ.. డిగ్రీ కళాశాలలో గదుల కొరత ఉందని, గదులను సర్దుబాటు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలకు ఇచ్చిన స్థల మార్పిడి రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయించాలన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివారెడ్డి, ఎంఈఓ కోటయ్య, సుబ్రమణ్యం, హెచ్ఎం సునీత, తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి


గృహ నిర్మాణదారులతో మాట్లాడుతున్న అధికారులు

సి.బెళగల్: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఈఈ వెంకటదాసు అన్నారు. శుక్రవారం ఆయన డీఈ వాసుదేవరావుతో కలిసి మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో హౌసింగ్ లే అవుట్‌లో జరుగుతున్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడి, నిర్మాణాలు వెంటనే పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఈ సుమంత్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రంగన్న ఉన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

పాణ్యం: రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పాణ్యంలోని టి.చంద్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రోజూ ఉదయం 9–12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. పాణ్యం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 230 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 190 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సయ్యద్‌బాబు తెలిపారు. అలాగే నెరవాడ మెట్టు వద్ద ఉన్న ఏపీటీ డబ్ల్యూ ఆర్‌జేసీ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు 264 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 240 మంది పరీక్షలకు హాజరవుతారని ప్రిన్సిపాల్ రామునాయక్ వెల్లడించారు.

వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకోవాలి


కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్: ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలంతా 100రోజుల పనిదినాలను పూర్తి చేసుకోవాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. శుక్రవారం కోడుమూరులో ఉపాధి పథకం కింద జరుగుతున్న పనులను ఏపీఓ మోదీన్‌బాషా తనిఖీ చేసి కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ఏపీఓ మాట్లాడుతూ కూలీలంతా ప్రతి రోజు ఉదయాన్నే పనుల్లోకి రావాలని, ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజు వారి వేతనం రూ.300ల వరకు పడుతుందన్నారు. కూలీలు చేసే పనుల్లో నాణ్యత ఉండేలా ఉపాధి సిబ్బంది చూడాలని ఏపీఓ ఆదేశించారు. అలాగే గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే వారందరికి ఉపాధి పథకం కింద పనులు కల్పించడం జరుగుతుందని ఏపీఓ సూచించారు. కాగా పనులు చేసిన ప్పటికీ వేతనాలు ఇంకా తమ ఖాతాల్లో జమకాలేదని కూలీలు ఏపీఓ దృష్టికి తీసుకురాగా, బిల్లులు పంపామని త్వరలో మంజూరవుతాయన్నారు.

విజేత సాతర్ల వృషభాలు

కోడుమూరు రూరల్: గూడూరు మండలం గుడిపాడు గ్రామంలో వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాష్ట్రస్థాయి 6పాలపళ్ల సైజు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. 7 జతల వృషభాలు పోటీపడగా తెలంగాణ రాష్ట్రం సాతర్ల గ్రామానికి చెందిన ఎస్ఎస్‌కె బుల్స్ విజేతగా నిలిచాయి. ఎమ్మిగనూరు మండలం దైవందిన్నెకు చెందిన లక్ష్మీనరసింహ వృషభాలు 2వ, నందవరం గ్రామానికి చెందిన ఆంజనేయులు వృషభాలు 3వ, నంద్యాల జిల్లా ఎస్.కొత్తూరుకు చెందిన బీఎస్ఎస్‌రెడ్డి వృషభాలు 4వ, కోడుమూరు మండలం వర్కూరుకు చెందిన తలారి రామచంద్రా వృషభాలు 5వ స్థానాల్లో నిలిచాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చంద్రారెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బండ లాగుతున్న వృషభాలు

కనులపండువగా బుగ్గరామేశ్వరుని రథోత్సవం


అశేష జనవాహిని మధ్య స్వామి వారి రథోత్సవం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన భ్రమరాంబదేవి, బుగ్గరామేశ్వర స్వాముల వారి రథోత్సవం మనోహరంగా సాగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వాముల రథోత్సవం అశేషజనవాహిని మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ మద్దిలేటి ఆధ్వర్యంలో జరిగిన రథోత్సవ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, టీటీడీ నాయకులు మల్లెల రాజశేఖర్, గౌరు వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ అర్చకులు క్లె లక్ష్మీనారాయణ శర్మ ఉత్సవ మూర్తులకు నూతన వస్త్రాలు ధరింపజేసి, పల్లకిలో ఆశీనులను గావించారు. మంగళ వాయిద్యాలు, నందికోల సేవ, డప్పుల మధ్య స్వాముల వారి పల్లకిని రథశాల వద్దకు తీసుకెళ్లారు.

అంధకారంలో స్వాముల వారి రథోత్సవం

ఆది దంపతులను రథంపైకి చేర్చి రథాంగబలి, కుష్మాండ కాండలతో శాస్త్రోక్తంగా క్రతువులు నిర్వహించారు. ఎమ్మెల్యే గౌరు చరిత ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభం కావాల్సిన రథోత్సవం గంట ఆలస్యం కావడంతో భక్తులు నిరీక్షించారు. ఈ ఏడాది రథానికి అలంకరణ చేయకపోవడంతో కళ తప్పింది. అశేష జనవాహిని మధ్య తరలిపోతున్న స్వాముల వారి రథోత్సవంపైకి పూలు పండ్లు విసురుతూ ఓం నమఃశివాయ.. శివాయ నమః, హరహర మహదేవ శంభో శంకర అంటూ భక్తుల కరచాల ధ్వనుల మధ్య ఆలయ పరిసరాలు మార్మోగాయి. రథశాల నుంచి నంది మండపం వరకు కొనసాగిన స్వాముల వారి రథం తిరిగి యథాస్థానానికి చేర్చారు.

కనిపించని బాణ సంచా పేలుడు

బుగ్గరామేశ్వరస్వామి రథోత్సవం జరిగే సమయంలో ఏటా విభిన్నాకృతులతో తయారుచేసిన భారీ బాణసంచాను పేల్చడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో స్వాముల రథోత్సవం ఆరంభమైనట్లు భక్తులు సూచనప్రాయంగా భావించేవారు. అయితే ఈ ఏడాది అలాంటిదేమీ లేకపోవడంతో రథోత్సవం ఎప్పుడు ప్రారంభమైందనేది భక్తులకు అర్థం కాలేదు. దీంతో సమయానికి చేరుకోలేక పోయారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భోగేశ్వరుడి రథోత్సవం

గడివేముల: శ్రీ దుర్గాభోగేశ్వరుడి రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు శ్యాంసుందర్ శర్మ రథానికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉత్సమూర్తులను రథంపై కొలువుంచారు. స్వామివారి రథాన్ని వివిధ రకాల పూలతో అలంకరించారు. రథం ముందు యువకులు చేసిన నందికోలు నాట్యం, కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అంతకుముందు స్వామివారికి అభిషేకం, ధూపదీప నైవేద్యాలు, బలిహరణ వంటి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పరవశించిపోయారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈఓ రామానుజన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల కోలాహలం, కళాకారుల ప్రదర్శన మధ్య స్వామివారి రథాన్ని ముందుకు లాగారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.




చెక్క భజనను వీక్షిస్తున్న భక్తులు


ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుకాణాలు

ఉత్సవాల సందడి

పాణ్యం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రారంభమైన శ్రీ పాణికేశ్వరస్వామి ఉత్సవాలు శుక్రవారం తిరునాలతో వైభవంగా ముగిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయానికి భక్తులు పోటెత్తారు. పాణికేశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం భక్తుల వినోదానికై కళాకారులతో చెక్కభజన ఏర్పాటు చేయగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వీక్షించారు. తిరునాల సందర్భంగా ఆలయ ఆవరణలో బొమ్మలు, ఆట వస్తువుల దుకాణాలు, మిఠాయిల, గాజుల దుకాణాలు వెలిశాయి. సాయంత్రం ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి పూజలు చేశారు. ఈఓ సువర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో పాణికేశ్వర స్వామి




చిన్నారులు కేరింతలు